క్లుప్తంగా

యూటీఎఫ్ సేవలు ప్రశంసనీయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ లోకానికి యూటీఎఫ్ సేవలు ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మీనాక్షి పేర్కొన్నారు. సోమవారం కడపలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఆమె ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణా రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, శ్రీకాంత్, సురేష్ కుమార్, వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక 2025 డైరీ, క్యాలెండర్‌లను ఆ సంస్థ రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, నగర అధ్యక్షుడు శివరాం వెంకటేశ్వర్లు, సునీత, అరుణ, భాస్కర్, కుమారస్వామి, కరీముల్లా, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో..

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని సాయిరాం జూనియర్ కళాశాలలో మంగళవారం రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)- 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, నాయకులు కిరణ్, సంతోష్, ప్రమోద్, శ్యామ్, వెంకటరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నారాయణరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ నాయకుడు, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి తండ్రి వై.నారాయణరెడ్డి(80) మృతి చెందారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఏపీహెచ్‌బీ కాలనీలోని వారి స్వగృహంలో కన్నుమూశారు. విషయం తెలుసున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారి ఇంటికి వెళ్లి నారాయణరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేదలకు సాగు భూమి ఇవ్వాలి



కడప ఆర్డీవో పరిపాలన అధికారికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో అర్హులైన పేద ప్రజలను గుర్తించి సాగు భూమి మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో కడప ఆర్డీవో పరిపాలన అధికారి శంకర రావును కలిసి లబ్ధిదారుల జాబితా ఎంపిక చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 11వ తేదీన రెండు ఎకరాల సాగు భూమి కోసం జరిగిన ధర్నా అర్జీలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గంగయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



యువకుడి మృతదేహాన్ని తీసుకుని వెళుతున్న మేము సైతం సంస్థ సభ్యులు

కడప అర్బన్ : కడప నగరంలోని మహావీర్ సర్కిల్ సమీపంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి (35) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. యువకుడి మృతదేహాన్ని గత నాలుగు రోజులుగా రిమ్స్ మార్చురీలో వుంచారు. ఈ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో కడప ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ సిఫారసు మేరకు సోమవారం కడపలోని మేము సైతం సేవాసంస్థ వారు అంత్యక్రియలకు తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో మేముసైతం సేవాసంస్థ సభ్యులు వంకధారి రాము, అయ్యవారయ్య, రామలోకం, రామరాజు, నరసింహ, శివరాం, గురవయ్య, నీలకంఠ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న క్యాలెండర్లు

- అందుబాటులోకి పలు రకాలు
- పంచాంగం, వాస్తు సమాచారం కూడా
- వంటలు, బ్యూటీ టిప్స్ ప్రత్యేకం



మార్కెట్‌లో వివిధ రకాల క్యాలెండర్లు

కడప కల్చరల్ : నూతన సంవత్సరం.. అంతా కొత్తగా ఉండాలని.. జీవితంలో మరింత కొత్తదనం చూడాలని.. వీలైతే రోజూ కొత్తగా ఉంటే జీవితం థ్రిల్‌గా ఉంటుందని సగటు మనిషి కోరుకుంటాడు. ఆనందంగా గడిపేందుకు కొన్ని రోజులను నిర్ణయించుకుంటాడు. ఈ సందర్భంగా బంధుమిత్రులకు కానుకలుగా ఇచ్చుకునేందుకు క్యాలెండర్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో దాదాపు 40 రకాల క్యాలెండర్లు అందుబాటులోకి వచ్చాయి. కంప్యూటర్ యుగం వచ్చినా మొబైల్ యుగం డ్యామినేట్ చేస్తూ ఉన్నా రంగురంగుల క్యాలెండర్లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.

మిగతా అన్ని రంగాలలో లాగే క్యాలెండర్ల రంగంలో కూడా పోటాపోటీగా వ్యాపారాలు సాగుతున్నాయి. డిమాండును ఊహించిన ప్రచురణకర్తలు వీలైనంత వరకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల పలురకాల క్యాలెండర్లు మార్కెట్లలో కనిపిస్తున్నాయి. ఇంత వరకు నెలలు, తేదీలకు పరిమితమైన క్యాలెండర్లు ప్రస్తుతం రకరకాల మార్పులను సంతరించుకున్నాయి. దాదాపు 50 రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సాధారణ క్యాలెండర్లే కాకుండా రంగురంగుల మల్టీకలర్, ఆయిల్ బోర్డు పేపర్‌తో క్యాలెండర్లను అత్యంత ఆకర్షణీయంగా రూపుదిద్దుతున్నారు. క్యాలెండర్ల వెనుక గల పేజీల్లో వాస్తు, పంచాంగం తదితర సమాచారాన్ని అందిస్తున్నారు. మహిళలను ఆకట్టుకునేందుకు బ్యూటీ టిప్స్, వంటల తయారీ, మెహందీ డిజైన్లు, వంటింటి చిట్కాలు, పుణ్యక్షేత్రాల వివరాలు అందిస్తున్నారు.

అందులోనే పంచాంగం

ఇటీవల క్యాలెండర్ల రంగంలో విపరీతమైన పోటీ నెలకొంది. ప్రముఖ పంచాంగకర్తల క్యాలెండర్లకు మంచి గిరాకీ ఉంటోంది. ముఖ్యంగా బుట్టె, తంగిరాల, పిడపర్తి, ములుగు తదితర పంచాంగకర్తలు రూపొందించిన క్యాలెండర్లు విపరీతమైన ప్రచారంతో విడుదలవుతున్నాయి. టీటీడీ ఈ సందర్భంగా నాలుగు రకాల క్యాలెండర్లను ప్రచురిస్తోంది.

కడపకే ఆ ఘనత

ఎన్నో అంశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన మన జిల్లా క్యాలెండర్ల విషయంలో అదే స్థాయి ఘనత సాధించింది. అందిన సమాచారాన్ని బట్టి మన జిల్లాలో తొలిసారిగా 1950లో రాయల్ అండ్‌కో వారు క్యాలెండర్లను రూపొందించి విక్రయించారు. వారి దుకాణం కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో ఉండేది. దుకాణ యజమాని జక్కా సుబ్బరాయులుశ్రేష్ఠి ఈ క్యాలెండర్లను రూపొందిం చేవారు. ఆ క్యాలెండర్ల సైజు, పేపరు కూడా ప్రత్యేకంగా ఉండడంతో.. ఆ పేపర్లకు రాయల్ సైజ్ పేపర్లుగా పేరు వచ్చింది. మొన్నటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సాధించిన రాయల్ పెద్దబాలశిక్ష, రాయల్ అట్లాస్ కూడా ఆ కంపెనీ వారు రూపొందించినవే కావడం విశేషం. మద్రాసుకు చెందిన గోపాల్ అండ్‌కో, వెంకట్రామ్ అండ్‌కో కంపెనీలు కడపలో కూడా తమ శాఖలను విస్తరించి క్యాలెండర్లు విక్రయించి పేరు సాధించాయి. 1952 నుంచి కడప నగరం వైవీ స్ట్రీట్‌లో పలు దుకాణాలలో క్యాలెండర్లను విక్రయించడం మొదలు పెట్టారు.

పది పైసల నుంచి ప్రారంభం

కడప నగరంలో తొలిసారిగా 1950 ప్రాంతంలో క్యాలెండర్ ధర 10 పైసలుగా ఉండేది. నేడు రూ.100 వరకు క్యాలెండర్లు లభిస్తున్నాయి. అతి చిన్న ప్యాకెట్ సైజ్ డైరీ లాంటి క్యాలెండర్లు రూ.10–30 వరకు మార్కెట్లలో లభిస్తున్నాయి. సాధారణ క్యాలెండర్ రూ. 10 ఉండగా, రూ.150 పెద్ద సైజు క్యాలెండర్లు కూడా అందుబాటులో వచ్చాయి. ఇందులో దాదాపు నాలుగు అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పుగల భారీ క్యాలెండర్లు, ఇనుప రేకు లాంటి ప్లాస్టిక్ షీట్లు గల క్యాలెండర్లు కూడా ఇటీవల అందుబాటులోకి వచ్చాయి. పలు ప్రముఖ కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ సంస్థల పేరిట క్యాలెండర్లు ముద్రించి బంధుమిత్రులతోపాటు వ్యాపారులకు, సన్నిహితులకు నూతన సంవత్సర కానుకగా ఉచితంగా అందజేస్తుంటారు.

ఆర్ఐఎఫ్, వైవీయూ మధ్య ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం, ఒడిస్సా భువనేశ్వర్‌లోని ప్రఖ్యాత పరిశోధన సంస్థ రీసెర్చ్ ఇండియా ఫౌండేషన్ (ఆర్ఐఎఫ్) మధ్య పరస్పర అవగాహన ఒప్పందం (మెమొరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్) కుదిరింది. రీసెర్చ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి ఎల్. వెంకటేశంరెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వైస్ చాన్సలర్ ఆచార్యకే కృష్ణారెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను పరస్పరం అందుకున్నారు. ఒప్పంద పత్రాలపై వైవీయూ రిజిస్ట్రార ఆచార్య పద్మ, వెంకటేశం రెడ్డి సంతకాలు చేశారు. బోధన, పరిశోధన, సామర్థ్య పెంపుదలతో విద్యాపరమైన పురోగతిని పెంపొందించడానికి ఈ రెండు సంస్థలు పరస్పరం కట్టుబడి ఉన్నాయి. అకడమిక్ సహకారం, పరిశోధన ఆవిష్కరణ, పరిశోధన, అకడమిక్ స్కిల్ అభివృద్ధిని ప్రోత్సహించడం భాగస్వామ్య లక్ష్యాలుగా నిర్ణయించుకున్నారు. విద్యా మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు, ఆన్‌లైన్, డ్యూయల్, ఎల్ఎంఎస్ విధానంలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల అభివృద్ధి చేయనున్నారు. వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, సమావేశాల ద్వారా జ్ఞానాన్ని పంచుకోవడం, ఈవెంట్‌లు, నాలెడ్జ్ షేరింగ్, కోర్సులు, పరిశోధన ప్రాజెక్టుల అభివృద్ధికి సాంకేతిక నైపుణ్యం వనరులను అందించుఉంటామని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, వైవీయూ వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో రీసెర్చ్ సెల్ డైరెక్టర్ ఆచార్య పులి చంద్ర ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంతో అవగాహన



పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికారులతో చర్చిస్తున్న ఏఎఫ్‌యూ వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మధ్య పలు అంశాలపై ఒప్పందం కుదుర్చుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ సోమవారం హైదరాబాద్‌లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికారులతో సమావేశమయ్యారు. విద్య, పరిశోధన, సాంస్కృతిక రంగాలలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై చర్చించారు. తెలుగువారసత్వాన్ని, లలితకళలను కలిపి పరిశోధనలు నిర్వహించడం, వనరుల భాగస్వామ్యం, సాంస్కృతిక మార్పిడి తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. త్వరలో దీనికి సంబంధించిన (ఓఎంయూ) ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ఏఎఫ్‌యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రాంతాలపై అవగాహన అవసరం

వైవీయూ : యువత నిరంతరం ఉత్సాహంగా ఉండేందుకు ఉత్సాహం చూపాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో 5 రోజులపాటు విశాఖ యువతకు ఇంటర్ డిస్ట్రిక్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ ఉంటుందని ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల విద్యార్థులు చారిత్రిక ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను సందర్శించడం వలన సమాజం పట్ల మమకారం ఏర్పడుతుందని అన్నారు. కడప జిల్లా పరిధిలోని సిద్దవటం, ఒంటిమిట్ట, తిరుమల తొలి గడప వెంకటేశ్వర స్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, గండికోట తదితర చారిత్రక ప్రదేశాలను చూసే అవకాశం లభించడం అభినందనీయమన్నారు. జిల్లాలో ఎన్నో చారిత్రక ప్రదేశాలు, కళాఖండాలు విశేషంగా ఆకర్షిస్తాయని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, వైయస్సార్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆచార్య జయరామిరెడ్డి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ, విశాఖ జిల్లా యువత పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, విద్యార్థులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎస్ఎఫ్ఐ పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యకోసం పోరాడుతున్నదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 డిసెంబర్ 30న స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా అధ్యయనం, పోరాటం నినాదంతో ఏర్పాటై నేటికి 55 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు సుమంత్, నగర నాయకులు రఘు, ఉదయ్, విజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ, బీఈడీ అవకాశం కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ, బీఈడీ అవకాశం కల్పించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రెవల్యూషనరీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా యూజీసీ నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యూనివర్సిటీలలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఫోర్ ఇయర్స్ డిగ్రీ అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఫోర్ ఇయర్స్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు 5వ సంవత్సరంలో ఇష్టమైన పీజీ లేదా బీఈడీ కోర్సులలో వారి నైపుణ్యాన్ని బట్టి ఐదో సంవత్సరం పూర్తి అయినట్లు సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలతోపాటు వైవీయూ యూనివర్సిటీ పరిధిలోని కొన్ని డిగ్రీ కళాశాలలో దాదాపు 200 మంది పైగా విద్యార్థులు ఫోర్ ఇయర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఐదో సంవత్సరంలో బీఈడీ గానీ పీజీ గాని చేరడానికి వైవీయూ అధికారులు అవకాశం కల్పించకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా వైవీయూ అధికారులు విషయాన్ని ఉన్నత విద్యా మండలితోపాటు విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఫోర్ ఇయర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులను యూనివర్సిటీలో గానీ అనుబంధ పీజీ, బిఇడి కళాశాలలో చేర్పించి వారి జీవితాలను బాగుపడే విధంగా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–ప్రొద్దుటూరు మధ్య తిరుగుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా కడప నుంచి కమలాపురం, సంబటూరు, కోగటం మీదుగా ప్రొద్దుటూరుకు వెళుతున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా మోచేతితో బస్సును నడపడంపై ప్రయాణికులు మండిపడ్డారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికే అధికారులు పలుమార్లు హెచ్చరించినా సంబంధిత డ్రైవర్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

నియామకం

కడప రూరల్ : విజయవాడ ఏపీ ఎన్జీవో హోమ్‌లో రాష్ట్ర గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జిల్లాకు చెందిన జ్యోతిని నియమించారు. తన నియామకం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు జ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు వై.ప్రసాద్ యాదవ్, నిత్య పూజయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు పరామర్శ

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు, టీడీపీ నేత వైవీబీ రాజేంద్రప్రసాద్ సర్పంచుల సంఘం, పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి సోమవారం.. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పరామర్శించారు. ధైర్యం చెప్పి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయమని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, జల్లు కొండయ్య, సింగంశెట్టి సుబ్బరామయ్య, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్, సర్పంచ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శులు భూమా గోపాల్‌రెడ్డి ,పార్థ సారధిరెడ్డి, యనమల సుధాకర్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం నాయకులు చింత కిరణ్ యాదవ్, కుప్పాల సుబ్బయ్య, సంగటి గంగిరెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, నాగార్జున ఆచారి, రామాంజనేయరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డైరీల అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు తమ వంతుగా సహకారాన్ని అందజేస్తున్న కడప వన్‌టౌన్ సీ రామకృష్ణ, ఎస్ఐ అమర్‌నాథ రెడ్డిలకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సీఐ, ఎస్ఐలకు నూతన సంవత్సర డైరీని అందజేశారు. ఈ కార్యక్రమలలో డిపో కార్యదర్శి శ్రీనివాసులు, ఇతర కార్మిక నేతలు పాల్గొన్నారు.

ఫ్లాగ్ డే నిధికి విరాళం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ సేకరించిన ఫ్లాగ్ డే ఫండ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.సలీంబాషాకు అందజేశారు. డిసెంబర్ 7వ తేదీన ఫ్లాగ్ డే పురస్కరించుకుని ఎన్‌సీసీ కేడెట్స్ ఫ్లాగ్ డే ఫండ్‌కు నిధులు సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్స్ సేకరించిన విరాళాలను అమరులైన సైనికుల కుటుంబ సభ్యులకు, వితంతువులకు అందజేసేలా సైనిక సంక్షేమ కార్యాలయానికి పంపుతామన్నారు. ఎన్‌సీసీ అధికారిణి డాక్టర్ బి.స్వరూప మాట్లాడుతూ దేశకోసం ప్రాణత్యాగం చేసిన సైనిక కుటుంబాలకు తాము ఉన్నామంటూ కేడెట్స్ నిధులు సేకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. వి.కృష్ణవేణి, రాజమోహన్, పి.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ పనులు నిలిపివేయాలి



ఆర్‌కే నగర్ వద్ద సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మాణానికి జరుగుతున్న పనులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో పోలీస్ పెట్రోల్ బంకు పక్కన జరుగుతున్న సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ పనులను వెంటనే నిలిపివేయాలని సీయోనుపురం , ఆర్‌కే నగర్, కో ఆపరేటివ్ కాలనీ వాసులు కోరారు. సోమవారం వారు ఆర్‌డీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే తమ ఇళ్ల మధ్యలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారని, ఇప్పుడు మళ్లీ సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో సీఎన్‌జీ ఫిల్లింగ్ పాయింట్‌లో పేలుడు సంభవించిందని, దేశంలో ఇంకా అనేక చోట్ల గ్యాస్ పైపులైన్ లీకేజీ వల్ల అనేక ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించిందన్నారు. కొన్ని సీఎన్‌జీ ఆటోలకు గ్యాస్ నింపుతున్నప్పుడు కూడా పేలుళ్లు జరిగాయని గుర్తుచేశారు. ఈ ఫిల్లింగ్ స్టేషన్ చుట్టుపక్కల 1500 కుటుంబాలు ఉన్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టం అధికంగా ఉంటుందన్నారు. అందువల్ల తాము భయాందోళనకు గురవుతున్నామని, కావున అధికారులు తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ పనులను నిలిపివేయాలని కోరారు.

ఉర్దూ స్కూలు కాంప్లెక్స్‌లు యథావిధిగా కొనసాగించాలి



మంత్రి ఫరూక్‌కు సమస్య వివరిస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్‌లను యథావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లోనే కొనసాగించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, ఆల్ మైనారిటీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఫరూక్ కోరారు. ఈ విషయమై వారు సోమవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎండీ ఫరూఖ్‌ను నంద్యాలలోని తమ క్యాంపు కార్యాలయంలో రూట రాష్ట్ర శాఖ, నంద్యాల జిల్లా శాఖ తరపున కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖాధికారుల హడావిడి నిర్ణయాలతో మైనర్ మీడియా ఉర్దూ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఉర్దూ మీడియం ఉపాధ్యాయులను ఇతర మీడియం కాంప్లెక్స్‌లలో విలీన దిశగా అడుగులేస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాఠశాల విద్యను పటిష్టం చేసేందుకు ఉర్దూ మీడియం టీచర్స్ అసెంబుల్ సెంటర్లు, టీచర్స్ కాంప్లెక్స్ సెంటర్లు, స్కూల్ కాంప్లెక్స్ సెంటర్లుగా పేర్లు మార్పు చెందుతూ వచ్చినా.. మైనర్ మీడియా కాంప్లెక్స్‌లు మేజర్ మీడియా కాంప్లెక్స్‌లలో ఎప్పుడూ కలపలేదని తెలియజేశారు. టీచర్స్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్ ప్రత్యేకంగా ఉర్దూ మీడియంలో నిర్వహిస్తే ఉపాధ్యాయులు, విద్యార్థులకు సత్ఫలితాలు ఇస్తాయని వివరించారు. ఉర్దూ మీడియం పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఉర్దూ కాంప్లెక్స్ ఉనికి కాపాడుతామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ డీఐ హష్మద్దీన్, రాష్ట్ర నాయకులు మహమ్మద్ అయ్యూబ్, అబ్దుల్ హకీమ్, అఫ్జల్ బాషా, దస్తగీర్, జానీ బాషా, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌కలాం, ఆర్థిక కార్యదర్శి మహమ్మద్ హనీఫ్, జిల్లా నాయకులు జక్రియా అలిఖాన్, మహబూబ్ బాషా, కలీముల్లా, మహబూబ్ బాషా అస్లం, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగజంగాలకు న్యాయం జరిగేలా కృషి



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న బేడ బుడగ జంగం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బేడ బుడగజంగం సామాజిక వర్గాల సమస్యలు పరిష్కరించి వారికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, శ్రీరాములు కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న బేడ బుడగజంగాలు కేంద్ర షెడ్యూలు కులాల జాబితాలో సీరియల్ నెంబర్ తొమ్మిదిలో ఒకటిగా ఉందన్నారు. బీకే లోకూర్, పి.రామచంద్ర రాజు, ఉష మొహ్రా వంటి కమిషన్లు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బుడగ జంగాలను ఎస్సీలుగా ఉన్నట్టుగా నివేదిక సమర్పించారన్నారు. గ్రామాల, మండలాల, పట్టణాల సచివాలయాల్లో షెడ్యూల్డ్ కులాల పేర్లు జాబితాలో బేడ బుడగజంగం కులం సంబంధించిన ప్రజల పేర్లు లేవని, 2023 కుల గణన సర్వేలో బేడ బుడగజంగం కులంను ప్రత్యేక కాలంలో నమోదు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి వాస్తవాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని మా జాతికి తగిన న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పి.రవితేజ, వెంకటేష్, లోకేష్, సురేష్, బ్రహ్మయ్య, చిన్న గంగులు అనేకమంది స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలి

కడప కార్పొరేషన్ : బేడ, బుడగజంగాలను తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చాలని బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి కోరారు. సోమవారం కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎస్సీ వర్గీకరణలో బేడ, బుడగ జంగాల కమ్యూనిటీని ఎస్సీలుగా కమిషన్ అధికారులకు నివేదిక పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేడ, బుడగ జంగం నాయకులు లక్ష్మయ్య, సి.వెంకటయ్య, పి.ఆంజనేయులు, ఎం.బాలస్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన అర్జీలను శాఖాధిపతులు స్వయంగా పరిశీలించి న్యాయపద్ధతిలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 42 అర్జీలు రాగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి -18, టౌన్‌ప్లానింగ్-8, రెవెన్యూ-9, యూపీఏ విభాగం-4 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, సిటీప్లానర్ రమణ, ఎంహెచ్ఓ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'నూతన' దర్శనాలకు ఏర్పాట్లు సిద్ధం



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

కడప కల్చరల్ : కొత్త సంవత్సరం సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు దేవతామూర్తులను దర్శించుకునేందుకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో వస్తే ఇబ్బందులు తలెత్తకుండా.. ఆలయంలో ఇప్పటికే బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో రూ.10 సామాన్య దర్శనంతోపాటు రూ. 25 ప్రత్యేక దర్శనం చేసుకునే అవకాశం కూడా కల్పించారు. బయట కూడా కొద్ది మేరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లోని భక్తులకు ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు నిరంతరాయంగా మంచినీటిని అందించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఎంత మంది భక్తులు వచ్చినా సరిపడేలా ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



బహుమతిని అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలోని కార్గో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డోర్ డెలివరీ బుక్ చేసిన వినియోగదారులకు లక్కీ డిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన ముగ్గురికి బహుమతులు అందజేశారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డోర్‌డెలివరీ ద్వారా తమపార్శళ్లను బుక్ చేసుకోవాలని కోరారు. వారంలో జరిగే లక్కీడిప్‌లో విజేతలుగా నిలువాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్గో ఏటీఎం జనార్దన్, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ట్రాఫిక్‌సూపర్ వైజర్ మంజుల, ఆర్ఎంఈ రాఘవేంద్ర, డీఎంఈ గురుప్రసాద్‌రెడ్డి, కార్గో కాంట్రాక్టు మేనేజర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.